క్లుప్తంగా

కరాటే పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో సత్తా చాటిన ధర్మవరం విద్యార్థులు

ధర్మవరం: ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ చూపారని మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ కరాటే మాస్టర్లు ఇనాయత్‌బాషా, నవ్యశ్రీ తెలిపారు. ఒంగోలులోని పార్వతిరెడ్డి ఆనంద్ మినీ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన 43వ యూనివర్సరీ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ధర్మవరానికి చెందిన 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరు కటాస్, కుమితే విభాగాల్లో 10 బంగారు పతకాలు, రెండు సిల్వర్ పతకాలు, 8 బ్రాంజ్ మెడల్స్ సాధించారని కరాటే మాస్టర్ తెలిపారు.

ఆర్టీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

నల్లమాడ: ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ లైసెన్స్ పునరుద్ధరించాలని కొండకింద తండాకు చెందిన నారాయణస్వామి నాయక్ ఆధ్వర్యంలో ప్రజలు సోమవారం నల్లమాడలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆర్డీటీ ఏరియా కార్యాలయం నుంచి మెయిన్ బజార్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రంగనాయకులుకు వినతిపత్రం అందజేశారు. ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించి ఆర్డీటీ కార్యకలాపాలు యథావిధిగా సాగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పారకల రమణ, సర్పంచ్ బొజ్జేనాయక్, ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాంప్రసాద్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగేనాయక్, నాగరాజునాయుడు, ప్రతాప్‌నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు రాజేంద్రనాయక్, వెంకటేష్‌నాయక్, బీసీ నాయకులు బుట్టి నాగభూషణ నాయుడు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా నాగదేవత, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ట



నాగదేవత, వినాయక విగ్రహాలు

ధర్మవరం రూరల్: చిగిచెర్లలో సోమవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వినాయక, నాగదేవత, నవగ్రహ, ఉమామహేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత వేదపండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బకాయి వేతనాలు చెల్లించండి

ముదిగుబ్బ: గ్రామీణ నీటి సరఫరా కార్మికులకు బకాయి పడిన తొమ్మిది నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కార్మికులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులకు వెంటనే వేతనాలను మంజూరు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన గోవిందరెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రామగిరి మండలం కలికివాండ్లపల్లికి చెందిన గోవిందరెడ్డి, ధర్మవరం మండలం ముచ్చురామికి చెందిన రామాంజి ద్విచక్ర వాహనంలో ఎన్ఎస్ గేట్ నుంచి చెన్నేకొత్తపల్లికి బయలుదేరారు. చెన్నేకొత్తపల్లి వై జంక్షన్ వద్ద బెంగళూరు వైపు నుంచి వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గోవిందరెడ్డి, రామాంజి గాయపడటంతో స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లు



మదనపల్లి బస్టాండ్‌లో స్వచ్ఛ భారత్ మూత్రశాలల నుంచి నీరు ప్లాట్‌ఫాంపైకి వస్తున్న దృశ్యం

ముక్కు మూసుకోవాల్సిందే!

- కంపు కొడుతున్న కదిరి ఆర్టీసీ బస్టాండ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కదిరి అర్బన్: ఆర్టీసీ బస్టాండ్లను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి రెండు గంటలకొకసారి మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినా కదిరి బస్టాండ్‌లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. బస్టాండ్ ఆవరణలోకి అడుగు పెడితే ముక్కు పుటాలాలు అదిరిపోయేలా కంపు కొడుతోంది. ముక్కు మూసుకుని ముందుకు పోవాల్సి వస్తోంది. డిపో పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ, అల్ట్రా పల్లె వెలుగు 110 బస్సు సర్వీసులు ఉన్నాయి. వీటిలో 476 మంది ప్రత్యక్షంగా, మరో 1,200 మంది పరోక్షంగా పని చేస్తున్నారు. రోజూ ఆరు వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు.

శిథిల దశలో మరుగుదొడ్లు

కదిరి బస్టాండ్‌లో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు నేడు శిథిల దశకు చేరుకున్నాయి. సెప్టిక్ ట్యాంక్ మరమ్మతుకు



మరుగుదొడ్ల వెనుక వైపు ఇలా..

గురవడంతో మరుగుదొడ్ల నీరంతా బయటికి వచ్చేస్తోంది. తాత్కాలికంగా మురుగుపై రేకులు పరిచారు. బస్సులు వెళ్లే ఈ మార్గంలో ప్రయాణికులు ముక్కుమూసుకుని పోవాల్సిందే. మురుగుపై వాలిన దోమలు కుట్టడం వల్ల ప్రయాణికులు అనారోగ్యాలకు గురవుతున్న సందర్భాలు ఉన్నాయి. ఇక స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద మదనపల్లి బస్టాండ్ (ప్లాట్ ఫాం) ముందు నిర్మించిన మరుగుదొడ్లకు నీటి సరఫరా సరిగా లేదని ప్రయాణికులు చెపుతున్నారు.

- మరుగుదొడ్ల నుంచి వచ్చే కంపునీటిని భరించలేకున్నామని బస్టాండ్ ప్రహరీకి ఆనుకుని ఉన్న నివాసాల ప్రజలు ఇదివరకే మున్సిపల్ కమిషనర్ కిరణకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. డిపో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారని స్థానికులు తెలిపారు.

స్వచ్ఛాంధ్ర అంటే ఇదేనా?



ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛ భారత్- స్వచ్ఛాంధ్ర అంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కదిరి బస్టాండ్‌లో పర్యటిస్తే ఇక్కడ ఎంత స్వచ్ఛంగా ఉందో అందరికీ తెలుస్తుంది. తుపాను పట్టుకుందంటే బస్టాండ్‌లో వర్షపు నీటితో పాటు మరుగుదొడ్లనీరు కలిసి ప్రవహిస్తాయి. ఇప్పటికైనా ప్రభుత్వం బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపరిచి, పరిశుభ్రత నెలకొల్పితే బాగుంటుంది.

– అహ్మద్, ప్రయాణికుడు కదిరి

ఉన్నతాధికారులకు నివేదించాం



మరుగుదొడ్లు చాలా పాతవి. శిథిల దశకు చేరుకున్నందున వాటి స్థానంలో కొత్తవి కట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే పాతవి తొలగించి నూతన మరుగుదొడ్లు నిర్మిస్తాం. ఇప్పటికైతే లోపల మరుగుదొడ్ల నిర్వహణ బాగానే ఉంది.

– మైనోద్దీన్, డీఎం, కదిరి

వైఎస్సార్‌సీపీ నేత కుటుంబానికి పరామర్శ

గాండ్లపెంట: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, కదిరి వ్యవసాయ మార్కెట్‌యార్డ్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ ఫారూఖ్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, హిందూపురం మాజీ పార్లమెంట్ సభ్యులు కర్నల్ నిజాముద్దీన్ సోమవారం మృతుని స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు పామిడి ఇక్బాల్, సూర్యనారాయణ రెడ్డి, అత్తార్ ఆసిఫ్, మేకల నరసింహులు, అజీమ్, ఆంజినేయులునాయక్, కొండయ్య తదితరులు ఉన్నారు.

మార్పు చేస్తే చరిత్రహీనులవుతారు



అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి టౌన్: ఎమ్మెల్యే బాలకృష్ణ మెప్పు కోసం హిందూపురాన్ని శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా మారిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు చరిత్రహీనులుగా నిలిచిపోతారని అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సత్యసాయి బాబా సోదరుడు ఆర్.వి.జానకిరామయ్య, ఈ ప్రాంతవాసుల చిరకాల కోరిక మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేశారన్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన పుట్టపర్తి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సింది పోయి ఏకంగా జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని చేయాలనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా కేంద్రం మారిపోతోందని జరుగుతున్న ప్రచారంపై ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేస్తే సమీపంలోని కర్ణాటక ప్రాంతం అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇది ఎంత మాత్రమూ సమర్థనీయం కాదన్నారు. అయినా సరే మార్పు చేయాలని చూస్తే ప్రజాసంఘాల మద్దతుతో ఉద్యమాలు చేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు.

భైరాపురం.. పరిశుభ్రత బహుదూరం



అపరిశుభ్రంగా ఉన్న శివాలయం వీధి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దాలని ఆదేశిస్తున్నా స్థానిక అధికారులకు పట్టించుకునే తీరిక లేనట్టుంది. కొత్తచెరువు మండలం భైరాపురం గ్రామం పరిశుభ్రతకు బహుదూరంగా ఉంటోంది. సుమారు 2వేల జనాభా కలిగిన ఈ గ్రామంలో ప్రధాన వీధులు మురుగు నీటితో నిండి ఉన్నాయి. ఏ ఇంటి నుంచి బయటకు వచ్చినా మురుగు నీటిని తొక్కుకుంటూ రావాల్సిందే. వీధుల్లోని మురుగు నీటిలో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడంతో రోగాలు ప్రబలుతున్నాయి. దీనికితోడు ఇటీవల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సిమెంటు రోడ్లు హెచ్చు తగ్గులు ఉండడంతో వర్షం నీళ్లు అక్కడక్కడా నిలుస్తున్నాయి. ఇక పాత సచివాలయ భవనంలోకి వెళ్లడానికి వీలు లేకుండా బురదమయంగా మారిపోయింది. అధికారులు స్పందించి పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పాఠశాల వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆడబిడ్డ నిధి ఎక్కడ బాబు?

కదిరి అర్బన్: ఆడబిడ్డ నిధి పథకం కింద 18 ఏళ్ల నిండి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీ ఏడాది దాటినా ఎందుకు అమలు చేయలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిలదీశారు. సోమవారం మొటుకుపల్లిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణికంఠనాయక్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఆడబిడ్డ నిధితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ప్రచారం చేసి.. ఇప్పుడు అమలు చేయకుండా మోసం చేయడం బాధాకరమన్నారు. ఇక స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఊదరగొట్టి.. ఇప్పుడు నిబంధనల పేరుతో కొన్ని బస్సుల్లోనే పథకం అమలు చేయడం మహిళలను వంచించడమేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమరనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, సర్పంచ్ రూపా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రైతు విభాగం నాయకులు జైనుల్లా, క్రిష్టానాయక్, విశ్వనాథ్, రవినాయక్, హనుమంతరెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఇరగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

కనగానపల్లి: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని ఏఓ మాధురి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆత్మా, వ్యవసాయ సిబ్బందితో కలసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్ఎస్‌కేలో రైతులతో సమావేశమై ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగులో మెలకువలు, చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంటల సాగు కోసం ఎక్కువగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడితే పెట్టుబడులు పెరుగుతాయన్నారు. సేంద్రియ పద్ధతులతో పంటలు సాగు చేస్తే పెట్టుబడి తగ్గి మంచి దిగుబడులు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆత్మా కో–ఆర్డినేటర్ ప్రబంధ, వీహెచ్‌ఏ రమ్యకృష్ణ, ఎంపీఈఓ జయరాం పాల్గొన్నారు.



రైతులతో సమావేశమైన ఏఓ, ఆత్మా సిబ్బంది

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు?

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన రమణకు అధిక వడ్డీకి అప్పు ఇచ్చి, అతడి నుంచి వసూలు విషయంలో ఏడుగురు వ్యక్తులు దాడిచేశారు. సోషల్ మీడియాలో దాడి దృశ్యాలు వైరల్ అవడంతో ఇదివరకే ఎస్పీ రత్న ఆధ్వర్యంలో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు (ఏ1) రాజశేఖర్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. ఇతడిని మంగళవారం అరెస్టు చూపించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

కదిరి టౌన్: 'ఓట్ చోర్' కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎస్ షానవాజ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కదిరిలో కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన చేపట్టారు. కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీకి తొత్తుగా మారి ఓట్లను చోరీ చేస్తూ నరేంద్ర మోదీని ప్రధానిని చేసిందన్నారు. తక్షణమే ప్రధాని గద్దె దిగాలన్నారు. ఓటు చోరీని అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నాయకులు జైనుల్లా, అల్లాబకాష్, నాగభూషణం, గౌసు, చంద్రకాంత్, బాబు, సుహేల్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యామ్నాయ' విత్తనాలు సరఫరా చేయండి

ఎన్పీకుంట: ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, స్వామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్‌లో పంటలు సాగు చేయలేకపోయారని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రత్యామ్నాయం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఇందుకు అనుగుణంగా అలసంద, మినుములు, పెసలు, ఉలవ విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలలో ఎమ్మార్పీ కన్నా బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సేవ కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే డీఏపీ, యూరియా, సూపర్ తదితర ఎరువులను అందుబాటులో ఉంచి సబ్సిడీ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చినమల్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పింఛన్ల తొలగింపు దారుణం

తనకల్లు: అర్హులైన వారి పింఛన్లు తొలగించడం దారుణమని ఏపీ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. పింఛన్లు పునరుద్ధరించాలని సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మండలంలో దాదాపు 300 మందికి వివిధ కారణాలతో పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే పింఛన్లను పునరద్ధురించకపోతే మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు మంజూరు చేసి ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, తోపు పారేసు, వీవీ రమణ, రమణ, ఒంటెద్దు వేమన్న, చిన్న వెంకటరమణ, శ్రీనివాసులు, వెంకటేసు తదితరులు పాల్గొన్నారు.



తనకల్లులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తొలగించిన పింఛన్లు పునరుద్ధరించండి

బత్తలపల్లి: తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని సీపీఐ, బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బాధితులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నరసింహనాయుడును పునరుద్ధరించాలని వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, బీఎస్పీ ధర్మవరం ఇన్‌చార్జ్ సాకే వినయ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ బత్తలపల్లి మండలంలో 512 మంది దివ్యాంగుల పింఛన్లు అన్యాయంగా తొలగించారన్నారు. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉన్నపళంగా పింఛన్ తొలగించడంతో కుటుంబ పోషణ, వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే 512 మంది దివ్యాంగుల పింఛన్ల పునరుద్ధరణకు సానుభూతితో చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, బీసీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుమ్మర వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బత్తల నాగభూషణ, బాధిత పెన్షన్‌దారులు పాల్గొన్నారు.



బత్తలపల్లిలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, బీఎస్పీ నాయకులు

సంక్షిప్త సమాచారం

వివాహిత అదృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీలో నివాసముంటున్న సాయిలీల అనే వివాహిత అదృశ్యమైంది. ఐదేళ్ల క్రితం ఈమెకు వివాహమైంది. భర్తతో విభేదాల నేపథ్యంలో మెట్టినింటి వచ్చేసి పుట్టింటిలో ఉంటోంది. ఈ నెల 13న తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన సాయిలీల బజారుకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఎన్ని చోట్ల వెదికినా కనిపించకపోవడంతో సోమవారం రాత్రి తండ్రి తిరుపాల్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కదిరి అర్బన్: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

'పరిష్కార వేదిక'కు అధికారుల గైర్హాజర్

ఎన్పీకుంట: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వైద్యశాఖ, ఏపీఎం, ఎస్‌హెచ్ఓ, విద్యుత్‌శాఖ, హాస్టల్‌వార్డన్, ఉపాధిహామీ ఏపీఓ, సిరికల్చర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గైర్హాజరయ్యారు. అధికారులు రాకుంటే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని తహసీల్దార్ అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారుల నివేదికను ఉన్నతాధికారులకు పంపి, తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బైండోవర్

ముదిగుబ్బ: యోగి వేమన రిజర్వాయర్(వైవీఆర్)లో చేపలు పట్టే విషయంలో ఘర్షణ చెలరేగిన నేపథ్యంలో ఇరువర్గాల వారిని సోమవారం తహసీల్దార్ నారాయణస్వామి ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

వెండి విగ్రహం చోరీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్టపై నూతనంగా నిర్మిస్తున్న సుంకులమ్మ ఆలయంలో చోరీ జరిగింది. పూజారి మందల శ్రీరాములు ఆలయం వద్దే ఉంటూ పూజలు చేసేవారు. ఆదివారం సాయంత్రం మార్కెట్ పనిమీద వెళ్లి సొంతింటికి వెళ్లాడు. సోమవారం ఉదయం పూజారి ఆలయానికి వస్తే 14 తులాల బరువు గల సుంకులమ్మ వెండి విగ్రహం కనిపించలేదు. తెల్లవారు జామున దుండగులు లోనికి ప్రవేశించి విగ్రహం అపహరించుకుపోయి ఉంటారని గ్రహించి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్‌లో అనర్హుల పేర్లు తొలగించాలి

నల్లమాడ: తమకు హక్కు, అనుభవం కలిగిన భూమిని ఆన్‌లైన్‌లో ఇతరుల పేరున నమోదై ఉందని, సదరు అనర్హుల పేర్లు తొలగించి తమ పేర్లను పొందుపరచాలని కాయలవాండ్లపల్లికి చెందిన పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ రంగనాయకులుకు వినతిపత్రం అందించారు. సాగుబడి శాసనం గడువు తీరిపోయినా కొందరు అన్యాయంగా తమ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో లక్ష్మీనరసప్ప, నరసింహులు, రామకృష్ణ, చంద్రశేఖర్‌నాయుడు, నరసింహ, నారాయణప్ప, ప్రభావతమ్మ, కె.నరసింహులు, సురేంద్ర ఉన్నారు.

పట్టు రైతులకు నేడు అవగాహన

ధర్మవరం రూరల్: 'నా పట్టు- నా అభిమానం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రేగాటిపల్లిలో పట్టు రైతులకు మల్బరీ మొక్కల పోషణ, వేపనూనె పిచికారీ, సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత తదితర వాటిపై అవగాహన కల్పించనున్నట్లు ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టి బోల్తాపడిన వాహనం

పరిగి: మండల కేంద్రమైన జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాలమేరకు అనంతపురం జిల్లా గుమ్మఘట్టకు చెందిన ఓ కుటుంబ సభ్యులు కర్ణాటకలోని చింతామణి వద్ద కేబుల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో టాటా 407 ఎస్ఎఫ్‌సీ వాహనంలో చింతామణి నుంచి సొంతూరుకు బయలుదేరి వస్తున్నారు. అలాగే సోమందేపల్లి మండలంలోని మండ్లికి చెందిన కిషోర్.. భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై పరిగి నుంచి బయలుదేరి పైడేటి రోడ్డు వైపు వెళ్తున్నాడు. పరిగి జాతీయ రహదారిని దాటుతుండగా వేగంగా వచ్చిన 407 వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడిపోయింది. అయితే అందరూ స్వల్పగాయాలతో బయట పడినట్లు స్థానికులు తెలిపారు.



బోల్తాపడిన వాహనం